# రొమాన్స్

● సి. రవీంద్రనాథ్ ●

**రాబర్ట్ ఏ.సి. గదిలో కూర్చుని ఆలోచించసాగాడు. బుర్రనిండా స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన విషయాలే.**

రాబర్ట్ చాలా తెలివైనవాడు. అయితే తెలివితేటలకన్నా ఒక మనిషి పైకి రావడం అనేది అతను చేసే కృషి మీద ఆధారపడి వుంటుందని మొదటి నుంచే రాబర్ట్ నమ్మకం. అయిదు సంవత్సరాల క్రితం చిన్న గదిలో స్టాక్ బ్రోకర్ జీవితాన్ని ప్రారంభించాడు. ఒక టైపిస్ట్ మేరి కూడా అతన్తో పాటు అంత కష్టపడింది. ఆమె అతని సెక్రటరీ, టైపిస్ట్, డిస్పాచ్ క్లర్క్ అన్నీ. అయిదేండ్లలో స్టాక్ బ్రోకర్‌గా రాబర్ట్ ఆకాశమంత ఎత్తుకు ఎదిగాడు. ఈనాడు సొంత ఫ్లాట్, సొంత ఆఫీస్, బిల్డింగ్, కారు హోదా అన్నీ ఉన్నాయి రాబర్ట్‌కు.

రాబర్ట్ మేరీల మనస్సులు కలిసాయి. తన విజయంలో మేరికి కూడా భాగం వుందని గుర్తించాడు రాబర్ట్. మేరిని తన జీవిత భాగస్వామిగా చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. మేరీ కూడా ఇందుకు ఆనందంగా అంగీకరించింది.

ఇంటర్ కామ్ బటన్ నొక్కి మేరిని తన చాంబర్‌లోకి పిలిచాడు రాబర్ట్. ఎప్పటిలాగే డిక్టేషన్ తీసుకోడానికి పెన్ను ప్యాడ్‌తో లోపలికి వచ్చింది మేరీ.

"డిక్టేషన్ కాదు కూర్చో చెబుతాను" చెప్పాడు రాబర్ట్. మేరీ కుర్చీలో కూర్చుంది.

"చాలాకాలంగా మనమిద్దరం పెళ్ళి చేసుకోవాలని అనుకుంటున్నాం."

రాబర్ట్ మాటలకు సిగ్గు పడుతూ అవునన్నట్లుగా తల ఊపింది మేరీ.

ఈ స్టాక్ వ్యాపార వ్యవహారాలలో పెళ్ళి చేసుకోడానికి టైం దొరకటం లేదు. వచ్చే శనివారం తప్పకుండా పెళ్ళి చేసుకుందాం. చర్చిలో ఫాదర్‌తో మాట్లాడి అన్ని ఏర్పాట్లు చేస్తాను. గత మూడు సంవత్సరాలుగా రాబర్ట్ అలా చెప్పడం, వెయ్యోసారో, లక్షోసారో, మేరీకి సరిగ్గా జ్ఞాపకం లేదు. అలాగే అన్నట్లుగా తల ఊపింది. రాబర్ట్ తనని మోసం చేస్తాడన్న అనుమానం ఆమెలో ఏ కోశానా లేదు. రాబర్ట్ తనని మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాడన్న విషయం ఆమెకు తెలును. అయితే స్టాక్ మార్కెట్‌లో 24 గంటలు మునిగి తేలుతూ దేశమంతా తిరిగే రాబర్ట్‌కు తనని పెళ్ళి చేసుకోడానికి నిజంగా టైమ్ దొరకటం లేదన్న విషయం కూడా వాస్తవమేనని ఆమెకు తెలును.

●●●

**రాబర్ట్ తనని మోసం చేస్తాడన్న అనుమానం ఏ కోశానా లేదు.**

●●●

తాను చెప్పదల్చుకున్నది చెప్పడం పూర్తి చేశాకా ఎదురుగా వున్న ఫైలు చదవడంలో మునిగిపోయాడు రాబర్ట్. మేరి లేచి నెమ్మదిగా బయటకు నడిచింది. మేరీ వెళ్ళిపోయిం తర్వాత పి.ఏ.ని పిలిచాడు రాబర్ట్.

"మేరీ బదులుగా మరో స్టెనోగ్రాఫర్‌ని చూడండి" చెప్పాడు రాబర్ట్ పి.ఏ.తో.

"సార్!" అన్నాడు పి.ఏ. ఆశ్చర్యంగా.

"మేరీ ఇటుపై పని చేయదు. ఆమె స్థానంలో ఎఫిషియంట్ హ్యాండ్‌ని చూడండి" చెప్పాడు రాబర్ట్.

కంపెనీ అభివృద్ధికి మేరీ చేసిన కృషి రాబర్ట్ పి.ఏ.కి తెలును మేరీని ఉద్యోగంలో నుంచి తొలిగించాలన్న నిర్ణయం రాబర్ట్ ఎందుకు తీసుకున్నాడో అతనికి అర్థం కాలేదు. కారణం చెబుతాడో ఏమోనని ఎదురు చూశాడు పి.ఏ. "ఇంక వెళ్ళచ్చు" అన్నట్లుగా తల ఊపాడు రాబర్ట్.

ఆ రోజు రాబర్ట్ బొంబాయి వెళుతున్నాడు.

❖ ❖ ❖ ❖

బొంబాయి వెళ్ళిన పని విజయవంతం కావడంతో చాలా ఉత్సాహంగా ఉన్నాడు రాబర్ట్. ఆఫీసుకు వస్తూనే తన చాంబర్‌లోకి వెళ్ళ

కుండా మేరీ సీటు దగ్గరికే వెళ్ళి ఉత్సాహంగా చెప్పాడు. "అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వచ్చే శనివారమే మన పెళ్ళి" అంటూ కోటు జేబులో నుంచి వంద రూపాయల కట్టలు తీసి అమె టేబుల్ మీద వరుసుగా పేర్చి చెప్పాడు. "యాభై వేలు బట్టలు, నగలు కొనుక్కో" అంటూ తన చాంబర్‌లోకి వెళ్ళిపోయాడు. రాబర్ట్ పి.ఏ. రాబర్ట్ చాంబర్‌లోకి వచ్చి చెప్పాడు. "మేరీ బదులు మరో స్టెనోను చూడమన్నారు కదా సార్, పేపర్ యాడ్ ఇచ్చాను. 22 మంది క్యాండి డేట్లు వచ్చారు. ఇంటర్వ్యూలు ప్రారంభిస్తారా."



పి.ఏ. వంక ఆశ్చర్యంగా చూశాడు రాబర్ట్. "మేరీ మన దగ్గర ఈ కంపెనీ ప్రారంభించినప్పటి నుంచి చాలా నమ్మకంగా పని చేస్తుంది. ఆమెను మార్చి వేరే వాళ్ళను పెట్టాల్సిన అవసరం ఏమొచ్చింది" అడిగాడు రాబర్ట్ కోపంగా.

"మీరే చెప్పారు కదా సార్ మేరీ ఇటుపై పని చేయదని, ఆమె బదులు వేరే క్యాండిడేట్‌ని చూడమని" మరింత ఆశ్చర్యంగా అడిగాడు పి.ఏ.

రాబర్ట్ ఆలోచనలో పడ్డాడు. "తాను అలా ఎందుకు చెప్పి ఉంటానా" అని.

బయట...

టేబుల్ మీద తల పెట్టుకొని వెక్కి వెక్కి ఏడుస్తుంది మేరీ. ఆమెను ఓదారుస్తుంటే ఆమె కొలీగ్ సరోజ అంది.

"మేరీ... రాబర్ట్ గారు మోసం చేసే మనిషి కాదు. ఆయన నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాడు. ఆ విషయం చాలాసార్లు నువ్వే చెప్పావు. ఇవాళ కాకపోతే, మరో నాడైనా నిన్ను తప్పకుండా పెళ్ళి చేసుకుంటాడు"




మేరీ తల ఎత్తింది కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది.

"సరోజా, రాబర్ట్ మోసగాడని నేను అనడం లేదు. అతను నన్ను ప్రేమించడం లేదనీ అనడం లేదు. ఈ మధ్య రాబర్ట్‌కి ఏదీ సరిగ్గా గుర్తుండడం లేదు. అతను తనతోపాటు నన్ను పెళ్ళి చేసుకున్నాడు. ఆ విషయం మర్చిపోయి వచ్చేవారమే మన పెళ్ళి అంటున్నాడు" అంది మేరీ వెక్కి, వెక్కి ఏడుస్తూ.